పది ఎకరాలలోపు భూమి ఉన్న వారికి రైతు భరోసా ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్.

బండ్లగూడ: పది ఎకరాల లోపు భూమి ఉన్న వారికి రైతు భరోసా తప్పకుండా కల్పించాలని హైదర్శ కోట్ పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్ కోరారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హైదర్శకోట్‌లోని సహకార సంఘం కార్యాలయంలో అత్యవసర సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద రైతులకు పెట్టుబడి సాయం ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్న సందర్భంగా రైతుల అభిప్రాయ సేకరణ అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఇన్ కంట్యాక్స్ రిటర్న్‌లు దాఖలు చేసేవారంతా ధనవంతులు కాదని, బ్యాంకర్లు రుణాలు ఇవ్వలంటే ఇన్ కంట్యాక్స్ రిటర్న్‌లు అడుగుతన్నారని, ఇందులో పేదవారు కూడా ఉన్నారని తెలిపారు. వీటిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం పది ఎకరాలలోపు భూమి ఉన్నవారికి సాగు చేసిన చేయకపోయిన రైతు భరోసా సాయం మాత్రం తప్పక అందించాలని ఆయన కోరారు. రైతు భరోసా డబ్బులు సైతం జులై నెలలో అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి, రాజేంద్రనగర్ సహాయ సంచాలకులు లీనా, గండిపేట్ మండల ఏఈఓ దోమ శ్రీనివాస్ గౌడ్, డిప్యూటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, డైరెక్టర్లు బుర్ర రమేష్‌గౌడ్, సురేష్‌గౌడ్, సుధాకర్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

మంచిరేవుల గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం

నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్


చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లను సన్మానిస్తున్న మంచిరేవుల కురుమ సంఘం నాయకులు

మణికొండ: మంచిరేవుల గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నిలిపేందుకు శాయశక్తులా కృషి చేస్తామని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ జి.విజయ్‌బాబు, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్‌లు అన్నారు. ఆదివారం మంచి రేవుల కురుమసంఘం ఆధ్వర్యంలో నూతనంగా చైర్ పర్సన్‌గా, వైస్ చైర్మన్లుగా ఎన్నికైన వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కులాలు, వార్డులలో ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కురుమ సంఘం భవన నిర్మాణం, బీరప్ప దేవాలయ అభివృద్ధి ఇతర అభివృద్ధి పనులను త్వరలోనే చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు వి.యాదయ్య, డి. యాదయ్య, దొబ్బ లక్ష్మణ్, దొబ్బ భాస్కర్, శ్రీరాములు, బాలకృష్ణలతో పాటు సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పేద ముస్లిం యువతీ, యువకులకు వివాహాలు


వివాహాలు చేయిస్తున్న సొసైటీ సభ్యులు

రాజేంద్రనగర్: హసన్‌నగర్ మైనార్టీ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేద ముస్లిం యువతీ, యువకుల వివాహాలను నిర్వహించారు. హసన్‌నగర్ నురానీ ప్రార్థన మందిరంలో 14 జంటలను ఈ సందర్భంగా ఏకం చేశారు. సొసైటీ ఆధ్వర్యంలో నూతన జంటలకు కావాల్సిన గృహోపకరణాలను అందజేశారు. సొసైటీ ఆధ్వర్యంలో 2009వ సంవత్సరం నుంచి నిరుపేద ముస్లిం యువతీ, యువకులకు వివాహాలను నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 123 వివాహాలు నిర్వహించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులతో పాటు మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ రమహత్ బేగ్, బహదూర్‌పురా ఎమ్మెల్యే మోబీన్, మాజీ కార్పొరేటర్ హబీబ్, మాజీ వార్డు సభ్యుడు మహ్మద్ జహంగీర్, నవాజుద్దీన్, షేక్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలి


ఆరోగ్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్

మణికొండ: ప్రస్తుత పరిస్థితిలలో ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకుని డాక్టర్ల సలహాలను పాటించాల్సిన అసవరం ఎంతో ఉందని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల వార్డు కార్యాలయంలో పంజగుట్ట శ్రీ సాయిబాబ స్పెషాలిటీ ఆసుపత్రి వారు ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనం తీసుకుంటున్న ఆహారంలో సరైన పోషకాలు లేక ఆరోగ్యాలు త్వరగా పాడవుతున్నాయన్నారు. వాటిని సమతుల్యం చేసుకునేందుకు పౌష్టికాహారం తీసుకోవటంతో పాటు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలలో అన్ని రకాల పరీక్షలను నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లంకల పద్మవీరారెడ్డి, డాక్టర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా క్యాస్ట్రో




రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా క్యాస్ట్రో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన నాగేంద్రబాబును బదిలీ చేశారు. దీంతో ఎలక్షన్ సెల్ స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న క్యాస్ట్రోను రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పర్యవేక్షణలో ప్రజలంతా పోలీసులకు సహకరించాలన్నారు. తమ ప్రాంతంలో జరుగుతున్న ప్రతి విషయాన్ని గమనించాలన్నారు. మాదక ద్రవ్యాలు తదితర వాటిని సేవిస్తున్నట్లు అనుమానం ఉంటే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి పేరును గోప్యంగా ఉంచుతామన్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో ప్రజలందరూ పోలీసులకు సహాయ సహకారాలను అందించాలన్నారు.

ఉచిత వైద్యశిబిరం


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి, ప్రకాష్‌గౌడ్ అన్నారు. ఆదివారం కాటేదాన్ రవి బ్రిలియంట్ స్కూల్‌లో బద్రివిశాల్ ట్రస్టు ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు వైద్యులు ఉచితంగా వైద్య సేవలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ పేదల కోసం ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ప్రజలు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో రవి బ్రిలియంట్ పాఠశాల సిబ్బంది, స్థానిక నాయకులు ఉన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లు అడ్డుకోవడంతోనే నాపై కేసులు


మాట్లాడుతున్న చిత్రపురి కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు వల్లభనేని అనిల్

రాజేంద్రనగర్: చిత్రపురి హౌసింగ్ సొసైటీ కాలనీలో అక్రమ రిజిస్ట్రేషన్లు అడ్డుకోనడంతో నాపై కేసులు పెట్టి జైలుకు పంపారని చిత్రపురి కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు వల్లభనేని అనిల్ పేర్కొన్నారు. ఈ కేసుపై తాను న్యాయం పోరాటం చేస్తున్నట్లు వెల్లడించారు. సొసైటీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 1994లో నటుడు ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయ్ భాస్కర్ రెడ్డి సినీ కార్మికుల శ్రేయస్సు కోసం 67 ఎకరాల 16 గుంటల స్థలం కేటాయించినట్లు తెలిపారు. గతంలోనే సొసైటీని ఏర్పాటు చేసి మొత్తం 4600 సభ్యులకు సభ్యత్వాన్ని అందించినట్లు వెల్లడించారు. తాను అధ్యక్షునిగా గెలుపొందిన అనంతరం ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదన్నారు. అవకతవకలను అడ్డుకోవడంతో పాటు వాటిని వెలికి తీస్తుండటంతో నాపై కేసులు బనాయించి జైలు పంపించారని ఆరోపించారు. ఇలాంటి సమయంలో సినీ కార్మికుల గృహ నిర్మాణాలు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సినీ కార్మికుల శ్రేయస్సు కోసం తనను పోరాడుతారని స్పష్టం చేశారు. త్వరలో జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసి అన్ని వివరిస్తారని తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

నాసిరకం పనులతో కుంగిన రోడ్డు

- ఇబ్బందులు పడిన ప్రయాణికులు
- మరమ్మతులు మొదలు పెట్టిన అధికారులు


లక్ష్మీనగర్‌లో కుంగిన రోడ్డుకు మొదలు పెట్టిన మరమ్మతు పనులు

మణికొండ: ఐటీ జోన్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు నాసిరకం పనులతో కుంగిపోవటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మణికొండ మున్సిపాలిటీ అంజలిగార్డెన్, లక్ష్మీనగర్ కాలనీల మీదుగా ల్యాంకోహిల్స్ జీ సర్కిల్ నుంచి ఐటీ జోన్‌కు అనుదినం వేలాదిమంది ప్రయాణిస్తుంటారు. ల్యాంకోహిల్స్ జీ సర్కిల్‌కు పక్కనే టీంఫోర్ నిర్మాణ సంస్థ తమ పనులను చేపడుతోంది. అయితే వారి డ్రైనేజీ పైప్‌లైన్ కోసం ఇటీవల పనులను చేపట్టారు. పైప్‌లైనులు వేసిన వెంటనే మరమ్మతులను ఆగమేఘాలపై పూర్తి చేశారు. ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో అది కాస్త మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఇంటి సమీపంలో ఆదివారం కుంగిపోయింది. దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటి వరకు ప్రారంభ స్థాయిలోనే ఉన్న నిర్మాణ సంస్థకు అప్పుడే డ్రైనేజీని కలుపుకునేందుకు మున్సిపాలిటీ అనుమతులు ఇవ్వటం, ఆ పనులను వారే నాణ్యత లేకుండా నిర్వహించటంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ఆరు నెలలుగా మున్సిపాలిటీ పాలక కమిటీ సమావేశాలు జరగకుండా వాటిలో తీర్మానం చేయకుండా సదరు సంస్థకు అనుమతులు ఎలా ఇచ్చారని, ఆ విషయాన్ని తాము లేఖ రూపంలో అడిగినా ఇప్పటి వరకు మున్సిపాలిటీ అధికారుల నుంచి సమాధానం లేదని కౌన్సిలర్ బి. పద్మారావు ఆరోపించారు. మున్సిపాలిటీ అధికారులు, పెద్దలు పెద్దఎత్తున టీంఫోర్ సంస్థ నుంచి డబ్బు దండుకుని ఎలాంటి తీర్మానాలు లేకుండా అనుమతులు ఇచ్చారని, ఆ విషయాన్ని ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని ఆయన వివరించారు. రాబోయే రోజుల్లో ఆ బండారం బయటపెడతామన్నారు.

మరమ్మతులు చేపట్టాం...

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రోడ్డు కుంగి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకుని వెంటనే మరమ్మతు పనులు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్ కుమార్ తెలిపారు. డ్రైనేజీ పనులు జరిగినప్పుడు కనీసం రెండు, మూడు నెలల పాటు వాహనాలు తిరిగి దృఢపడిన తరువాతనే ప్యాచ్‌వర్క్‌లు చేయాల్సి ఉంటుందన్నారు. ఆ పనులను టీంఫోర్ సంస్థ వారే నిర్వహించటం, వాటిని తమ మున్సిపాలిటీ అధికారులు పర్యవేక్షించకపోవటంతో వారిని మందలించామన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన


గంధంగూడలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పరిసరాల పరిశుభ్రత పనులను పారిశుధ్య కార్మికులు క్రమం తప్పకుండా నిర్వహించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. ఆదివారం ఉదయం కేంద్రియ విహార్ నుంచి గంధంగూడ రోడ్డుపై జరుగుతున్న స్వీపింగ్ పనులను ఆయన పరిశీలించారు. రోడ్లపై మట్టిలేకుండా చేయాలని, రోడ్లకి ఇరువైపులా చెత్తచెదారం లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు రామాంజులు, నవీన్, సుభాష్, యాదగిరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అత్తాపూర్‌లో మన్ కీ బాత్



అత్తాపూర్: భారత ప్రధాన నరేంద్రమోడీ మన్ కి బాత్ 111వ ఎపిసోడ్ అత్తాపూర్ డివిజన్ బూత్ నంబర్ 228లో డివిజన్ అధ్యక్షులు సాబాధ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రధాని మోదీ సూచించిన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దేశం ప్రధాని మోదీ పాలనలో అన్ని రంగాల్లో దూసుకెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువమోర్చా మీడియా కో– కన్వీనర్ కక్కునూరి కిరణ్ చారి, హరిపంతులు, నారగూడం సోమనాథ్, సాయియాదవ్, మణికంఠ, రాము, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 111వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ సీనియర్ నాయకులు కె.నర్సింహ ఇంట్లో బీజేపీ, నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, డివిజన్ అధ్యక్షులు జి.బాబురావు, ఉపాధ్యక్షులు పవన్ రాజ్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు తొండుపల్లి మల్లేష్, ప్రధాన కార్యదర్శి ఇ.వేణుగోపాల్, పెంటయ్య పాల్గొన్నారు.

సాగు చేస్తున్న రైతులందరికీ రైతుబంధు ఇవ్వాలి


మాట్లాడుతున్న చైర్మన్ సతీష్

శంషాబాద్: సాగు చేస్తున్న రైతులందరికీ రైతుబంధు పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని మల్కారం పీఏసీఎస్ చైర్మన్ బి.సతీష్ పేర్కొన్నారు. ప్రభుత్వాదేశాలతో మల్కారం పీఏసీఎస్‌లో ఆదివారం ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. కౌలు రైతులకు కూడా రైతుబంధు వర్తించేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి పలు సలహాలు, సూచనలు స్వీకరించి వాటిపై తీర్మానం చేసి పంపారు. ఈ సమావేశంలో పాలకవర్గ సభ్యులు శివాజీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ కోసం సమావేశం


దేవాలయ ఆవరణలో సమావేశమైన గ్రామస్తులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్‌లోని పోచమ్మ దేవాలయం ఆవరణలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు. దేవాలయ నూతన కమిటీని ఏర్పాటు చేసేందుకు ఏకగ్రీవంగా ఆమోదించారు. బుద్వేల్ గ్రామంలోని ప్రతి ఒక్కరికి విషయాన్ని తెలిపి పాత కమిటీతో పాటు గ్రామస్తులంతా హాజరై కమిటీని ఎన్నుకునేందుకు నిర్ణయించారు. జులై 7వ తేదీన ఉదయం 9.30 గంటలకు దేవాలయం ఆవరణలో తిరిగి సమావేశం కానున్నట్లు తెలిపారు. అదే రోజున నూతన కమిటీని ఎన్నుకుంటామని తెలిపారు. బుద్వేల్ గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

లారీ బీభత్సం... రెండు వాహనాలు ధ్వంసం



మైలార్‌దేవ్‌పల్లి : లారీ బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపుతప్పి ఇంటిని ఢీకొట్టిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం... చంద్రాయణగుట్ట నుంచి ఆరాంఘర్ వెళ్తున్న ఓ లారీ బ్రేకులు ఫెయిల్ కావడంతో ఇంటి గోడను ఢీకొట్టింది. దీంతో గోడ పక్కన పార్కు చేసి ఉన్న ఆటో, కారు రెండు వాహనాలపై గోడ కూలడంతో వాహనాలు ధ్వంసమయ్యాయి. కాగా ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. వెంకటేష్ అనే డ్రైవర్ ఇటీవలే ఓ లారీని కొనుగోలు చేసి నడిపిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

శంషాబాద్: ఓ దుకాణం ముందు బోర్డుకు సంబంధించిన ఫ్రేమ్ కడుతుండగా విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని ఊట్‌పల్లిలో నివాసముంటున్న అశోక్‌కుమార్ (28) ఆదివారం మధ్యాహ్నం డ్యూటీకి వెళుతున్నాని చెప్పి బయలుదేరాడు. రిలయన్స్ మార్ట్‌కు ఎదురుగా ఖాజా అనే వ్యక్తి టైలర్ దుకాణం బోర్డును ఫ్రేమ్‌ను బిగించాలని చెప్పడంతో దానిని బిగించేందుకు పైకి ఎక్కాడు. ఈ క్రమంలో ఇనుప ఫ్రేముకు విద్యుత్ వైర్లు తగలడంతో షాక్‌కు గురై కింద పడ్డాడు. సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భార్య మేనక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


మాజీ ఉపాధ్యాయులను సత్కరించిన పూర్వ విద్యార్థులు

మణికొండ: వారంతా నార్సింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 20 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఓసారి కలవాలని నిర్ణయించి ఆదివారం నార్సింగిలోని ఓ ప్రైవేటు ఫాంహౌస్‌లో పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసుకుని అప్పట్లో తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. గత స్మృతులను స్మరించుకుని రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శివశంకర్, రాములు, మాణిక్‌లాల్‌లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బండ్లగూడ మాజీ సర్పంచ్ గంగిని హరికృష్ణ, కోకాపేట మల్లేష్‌యాదవ్, జెల్లి మహేందర్, శ్రీశైలం, గోపాల్‌లతో పాటు అప్పటి బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం

నాటిన ప్రతీ మొక్క ఎదిగేలా చూడాలి : ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి ఎదుగుదలకు తోడ్పడాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 75వ వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై వన మహోత్సవాన్ని ప్రారంభించి కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని మొక్కలు మానవాళి మనుగడకు దోహదం చేస్తాయని అన్నారు. ప్రస్తుతం నాటిన మొక్కలను సంరక్షిస్తే అవి పెరిగి తర్వాతి భావితరాలకు ఆహ్లాదకరమైన మంచి వాతావరణం గాలి అందిస్తాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్, కమిషనర్ శరత్‌చంద్ర, మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, తలారి చంద్రశేఖర్, శ్రీనాథ్‌రెడ్డి, పాపయ్యపద్మావతి, నాయకులు ప్రేమ్‌కుమార్‌గౌడ్, సురేష్‌గౌడ్, సుమన్‌గౌడ్, మున్సిపల్ అధికారులు, వివిధ పార్టీల నాయకులు, కాలనీల వాసులు పాల్గొన్నారు.